

అధిక వడ్డీ ఆశ చూపి..
అధిక వడ్డీకి ఆశపడి కోదాడ, చిలుకూరు ప్రాంతవాసులు ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో పెట్టుబడి పెట్టి మోసపోయారు. - 8లో



కాంగ్రెస్‌కు మద్దతివ్వాలి
లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ వెంకటేశ్వర్లు కోరారు. - 8లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-33 (బుధవారం సా॥)
సహర్ 4-58 (గురువారం ఉ॥)

న్యూస్‌రీల్

రెండో రోజు 11,893 మంది హాజరు

సూర్యాపేటటౌన్ : పదో తరగతి వార్షిక పరీక్షలు రెండో రోజైన మంగళవారం ప్రశాంతంగా కొనసాగాయి. జిల్లాలో మొత్తం 67 సెంటర్లలో హిందీ పరీక్ష నిర్వహించారు. మొత్తం 11,933 మంది విద్యార్థులకు 11,893 మంది హాజరు కాగా 40 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈఓ అశోక్‌తో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి.

నిబంధనల మేరకు తనిఖీలు చేయాలి


తనిఖీలు చేస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట రూరల్: సామాన్య ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిబంధనల మేరకు వాహన తనిఖీలు చేయాలని ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశించారు. 65వ నంబర్ హైవేపై జనగాం క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలను మంగళవారం పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్పీ రవి, సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ బాలునాయక్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి
సూర్యాపేట క్రైం: పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ రాహుల్ హెగ్డే సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. మద్యం మత్తులో, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే సీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవి, డీసీఆర్బీ డీఎస్పీ మట్టయ్య, సీఐలు రాజశేఖర్, సురేందర్‌రెడ్డి, శ్రీను, రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏపీపీగా శ్రీపాల్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



చివ్వెంల(సూర్యాపేట) : సూర్యాపేట అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు అడిషనల్ పీపీగా యంపాల శ్రీపాల్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సుభాష్ రాథోడ్ బదిలీపై జహీరాబాద్ కోర్టుకు వెళ్లగా, అక్కడ నుంచి బదిలీపై శ్రీపాల్ రెడ్డి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఆయనకు స్వాగతం పలికారు.

మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్

గరిడేపల్లి: గ్రామాల్లో మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం గరిడేపల్లి మండలం మర్రికుంట గ్రామంలో పారిశుద్ధ్యం, నర్సరీని పరిశీలించారు. ఎన్నికల కోడ్‌పై అవగాహనకల్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ వనజ, ఎంపీఓ మౌలానా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు పంచాంగం ఆవిష్కరణ

నేరేడుచర్ల : హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఈనెల 21వ తేదీన క్రోధినామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ధూప, దీప, నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంభొట్ల ఫణికుమారశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ధూప దీప నైవేద్య అర్చకులందరు తరలిరావాలని కోరారు.

వణికిస్తున్న 'మంప్స్'

- గవద బిళ్లల వ్యాధి బారిన చిన్నారులు
- రెండు నెలలుగా వైరస్ వ్యాప్తి
- పెరుగుతున్న కేసుల సంఖ్య
- జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన



సూర్యాపేట రూరల్: జిల్లా ప్రజలను మంప్స్ (గవద బిళ్లల వాపు వ్యాధి) వణికిస్తోంది. రెండు నెలలుగా వందలాది మంది చిన్నారులు ఈ వ్యాధి బారిన పడి నానా అవస్థలు పడుతూ మంచానికే పరిమితమవుతున్నారు. ఈ వ్యాధి సోకిన వారు చెవుల కింద దవడ భాగంలో వాపు రావడంతో పాటు కండరాల నొప్పి, తల, కీళ్ల నొప్పులు, వాపు, నోరు తడారి పోవడం, ఆకలి మందగించడం, జ్వరం తదితర లక్షణాలతో బాధపడుతున్నారు. గొంతు సమీపంలో తీవ్రంగా నొప్పి ఉండడంతో పిల్లలు భోజనం చేయలేని పరిస్థితి నెలకొంది.

పదిహేనేళ్లలోపు పిల్లలకు..
వైరస్ లక్షణాలు కనిపించగానే వైద్యులను సంప్రదించాలని, లేకపోతే మరింత ఇబ్బంది పడాల్సి వస్తుందని వైద్యులు అంటున్నారు. వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేస్తే చెవుడు వంటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. గవద బిళ్లల సమస్యతో బాధపడుతున్న వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, మాట్లాడినప్పుడు వైరస్ గాలిలో ప్రయాణించి ఇతరులకు వ్యాప్తి చెందుతుంది. ఎక్కువగా 15 ఏళ్లలోపు పిల్లల్లో ఈ సమస్య కనిపిస్తుంది. స్కూల్‌కు వెళ్లే చిన్న పిల్లలకు ఒకరికి సమస్య ఎదురైతే వారికి తెలియకుండానే తోటి చిన్నారులకు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. ఇలాంటి సమయంలో పిల్లల తల్లిదండ్రులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఐసోలేషన్‌లో ఉంచితే మంచిది
రెండు నెలలుగా చిన్నపిల్లలను గవద బిళ్లల వ్యాధి వేధిస్తుండడంతో వారి తల్లిదండ్రులు వైద్యం కోసం పరుగులు పెడుతున్నారు. దీంతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు మున్సిపల్ కేంద్రాల్లో ఏ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లినా పదుల సంఖ్యలో గవద బిళ్లల బారిన పడిన చిన్నారులే కనిపిస్తున్నారు. అయితే గవద బిళ్లల వ్యాధి సోకిన వారు వారం రోజుల పాటు ఐసోలేషన్‌లో ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మంప్స్‌తో బాధపడుతున్న పిల్లలను స్కూల్‌కు పంపకూడదని, ఇంట్లో ఉంచడం మంచిదని వైద్యులు సలహా ఇస్తున్నారు. వ్యాధి ఉన్న సమయంలో తేలికపాటి ఆహారం అందించాలంటున్నారు. తగినంత మంచినీరు, పండ్ల రసాలు ఇవ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

నిర్లక్ష్యం చేయొద్దు



మంప్స్‌తో ఆస్పత్రికి వచ్చే పిల్లల సంఖ్య పెరిగింది. వ్యాధి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయవద్దు. ఒకరి నుంచి మరొకరికి తేలికగా సోకే అవకాశం ఉన్నందున వెంటనే వైద్యం చేయించుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే చెవుడు వచ్చే ప్రమాదం ఉంది. మంప్స్ బాధితులకు మంచి ఆహారం ఇవ్వాలి.
– డాక్టర్ జి.చంద్రశేఖర్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు


• కమనీయం రథోత్సవం
యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయొద్దు

- జిల్లా ఎన్నికల అధికారి వెంకటరావు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి వెంకటరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నూతనంగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల ఇంజనీర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్. లతతో కలిసి పాల్గొన్నారు. నీటి పారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్, వైద్య ఆరోగ్య, మున్సిపాలిటీలు, వ్యవసాయ , ఎస్సీ, బీసీ వెల్ఫేర్ తదితర శాఖల పనులపై సమీక్షించి మాట్లాడారు. జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఎన్నికల కోడ్‌కు ముందు జరుగుతున్న పనులు, కోడ్ తర్వాత ఉన్న పనులు, టెండర్ ప్రక్రియలో గల పనుల వివరాలు సత్వరమే అందించాలన్నారు. కోడ్‌కు ముందు జరుగుతున్న పనులు యథావిధిగా కొనసాగించవచ్చని సూచించారు. పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నా నివేదికలో చూపాలని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడితే బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డీఎఫ్ఓ సతీష్‌కుమార్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర రావు, ఇరిగేషన్ ఈఈ రమేష్, ఆర్ అండ్ బీ ఈఈ భాస్కర్ రావు పాల్గొన్నారు.

మనువాద దాడికి వ్యతిరేకంగా పోరాడాలి


తుంగతుర్తిలో మాట్లాడుతున్న కొత్తపల్లి రేణుక

తుంగతుర్తి: బీజేపీ ప్రభుత్వ పాలనలో మనువాద దాడికి వ్యతిరేకంగా మహిళలు పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక పిలుపునిచ్చారు. మంగళవారం తుంగతుర్తిలో పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ సభలో ఆమె మాట్లాడారు. మన హక్కులను, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బోయిని నాగమ్మ, నర్మద, జీడి అరుణ, గుండాల నీలమ్మ, మల్లమ్మ, కలమ్మ, బయ్య పద్మ, జలగం పద్మ, గంగ, సోమక్క, భాగ్యమ్మ, మైన, రాములమ్మ, వెంకటమ్మ, సుజాత పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫామ్‌కు నిధులు

- కుట్టు పనికి రూ.7,91,900 విడుదల చేసిన ప్రభుత్వం
- తొలివిడతగా 'పీఎం శ్రీ'కి ఎంపికైన 20 పాఠశాలలకు..
- త్వరలోనే అన్ని స్కూళ్లకు వచ్చే అవకాశం
- జిల్లాలో 67,266 మంది విద్యార్థులు



హుజూర్‌నగర్: వచ్చే విద్యా సంవత్సరం(2024–25)లో ప్రభుత్వ పాఠశాలల్లో చదవబోయే విద్యార్థులకు జూన్ మొదటి వారంలోనే యూనిఫామ్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ వేసవిలోనే అన్ని జిల్లాలకు వస్త్రం సరఫరా చేసి యూనిఫామ్ కుట్టించేందుకు ఇటీవలే నిధులు కూడా కేటాయించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ స్కూళ్లను బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంశ్రీ పథకం కింద జిల్లాలో ఎంపికైన 20 పాఠశాలలకు తొలి విడతగా రూ.7,91,900ల నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మే నెల వరకు యూనిఫామ్ సిద్ధం చేసి జూన్‌లో పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్ అందించాలని విద్యాశాఖకు ఇచ్చిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం ఆదేశించింది.

పీఎంశ్రీ పథకం స్కూళ్లకు నిధులొచ్చాయి



జిల్లాలో ప్రస్తుతం పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలలకు మాత్రమే యూనిఫామ్ కుట్టు కూలికి సంబంధించిన నిధులు విడుదల అయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం యూనిఫామ్ కుట్టిన మహిళా సంఘాల బ్యాంకు ఖాతాల్లో నిధులను జమ చేస్తాం.
– కె.అశోక్ డీఈఓ, సూర్యాపేట

ఒక్కో జతకు రూ.50 చొప్పున..
స్కూల్ విద్యార్థులకు యూనిఫామ్ తయారీ కోసం తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటీవ్ సొసైటీ లిమిటెడ్(టిస్కో) నుంచి వస్త్రం కొనుగోలు చేయనున్నారు. అనంతరం ఆ వస్త్రాన్ని ఎమ్మార్సీలకు సరఫరా చేస్తారు. దీన్ని స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు పంపించి యూనిఫామ్ కుట్టించనున్నారు. విద్యార్థులకు అందజేసే ఒక్కో జత యూనిఫామ్‌కు రూ.50 చొప్పున రెండు జతలకు రూ.100 కుట్టుకూలి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మిగతా పాఠశాలలన్నింటికీ మలి విడతలో నిధులు మంజూరు చేయనున్నట్టు సమాచారం.

1.34లక్షల జతల యూనిఫామ్ అవసరం
జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు, గురుకులాలతో కలిపి మొత్తం 906 వరకు పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 67,266 మంది విద్యార్థులు 1నుంచి 12వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున మొత్తం 1,34,532 జతల యూనిఫామ్ కుట్టాల్సి ఉంటుంది. అయితేన రెండేళ్లుగా మహిళా సంఘాలకే యూనిఫామ్ కుట్టే బాధ్యత అప్పగించాలని ఆదేశాలిస్తున్నా చాలాచోట్ల అమలు కావడం లేదు. ఈసారి తప్పనిసరిగా వారికే ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో విద్యాశాఖ అధికారులు మహిళా సంఘాలకే యూనిఫామ్ కుట్టే బాధ్యతలు అప్పగించాలని సన్నాహాలు చేస్తోంది.

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా ముస్తాబుచేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రసవత్తరంగా రక్తిగట్టించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, నవీన్‌కుమార్, లక్ష్మణాచార్యులు,పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి పాల్గొన్నారు.

నేడు తిరుమలగిరిలో అవిశ్వాసం

- చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టిన మున్సిపల్ కౌన్సిలర్లు
- ఉదయం 10 గంటలకు ప్రత్యేక సమావేశం
- ఆర్డీఓ సమక్షంలో ఓటింగ్


తిరుమలగిరి మున్సిపల్ కార్యాలయం

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనిరాజశేఖర్, వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డిపై కౌన్సిలర్లు బుధవారం అవిశ్వాసం పెట్టనున్నారు. ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేయనున్న మున్సిపల్ ప్రత్యేక సమావేశంలో చేతులెత్తే పద్ధతి ద్వారా ఓటింగ్ నిర్వహించనున్నారు. మున్సిపల్ పాలక వర్గంలో 15 మంది కౌన్సిలర్లు ఉండగా 10 మంది కౌన్సిలర్లు చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని తీర్మానం కాపీపై సంతకాలు చేసి గత నెల 26వ తేదీన కలెక్టర్‌కు అందజేశారు. దీంతో 20వ తేదీన అవిశ్వాస తీర్మానం కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సూర్యాపేట ఆర్డీఓను ఎన్నికల అధికారిగా నియమించారు. ఇదిలా ఉండగా మున్సిపల్ చైర్‌పర్సన్ సోమవారం చైర్మన్ పదవికి, 5వ వార్డు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేసినట్లు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. చైర్మన్ పదవికి మూడు రోజుల ముందే రాజీనామా చేయడంతో అధికారులు ఆమోదించలేదు. ఓకే చెప్పాలంటే ఐదు రోజుల ముందు రాజీనామా చేయాల్సి ఉంటుంది. దీంతో అవిశ్వాస తీర్మాన సమావేశం యథావిధిగా కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.

బలాబలాలు ఇలా ..
తిరుమలగిరి, మాలిపురం, నందాపురం, అనంతారం గ్రామాలతో కలిపి నూతనంగా తిరుమలగిరి మున్సిపాలిటీ 2018 ఆగస్టు 2న ఏర్పాటైంది. 2020 జనవరి 27న కొత్త పాలకవర్గం కొలువుదీరింది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి 11 మంది, కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు గెలుపొందారు. వీరిలో 2వ వార్డు కౌన్సిలర్ సి.హెచ్.హన్మంతు బీజేపీలో చేరారు. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన 7వ వార్డు కౌన్సిలర్ సరళాయాదవరెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ గిలకత్తుల ప్రియలతారాము గౌడ్, 4వ వార్డు కౌన్సిలర్ బత్తుల శ్రీను కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మందుల సామేల్ గెలిచిన తరువాత మరో ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నారు. రెండు రోజుల క్రితం కూడా మరో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎమ్మెల్యేను కలిసి క్యాంపుకు వెళ్లినట్లు తెలిసింది. ప్రస్తుతం వీరి బలం 12కు చేరింది. వీరితో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా స్థానిక శాసన సభ్యుడికి కూడా ఓటు హక్కు ఉంటుంది. తద్వారా వీరి బలం 13కు చేరుతుంది.

గెలుపు లాంఛనమే..
చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానంనెగ్గడం లాంఛనంగానే మారింది. అవిశ్వాసానికి అనుకూలంగా 12 మంది కౌన్సిలర్లు ఉండటంతో అవిశ్వాసం నెగ్గనుందని భావిస్తున్నారు. ఈ కౌన్సిర్లు అంతా క్యాంపులో ఉన్నట్లు తెలుస్తోంది. బుధవారం జరిగే అవిశ్వాస సమావేశానికి నేరుగా హాజరవుతారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. అవిశ్వాసంపై నిర్వహించే ప్రత్యేక సమావేశానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు.

మల్లు స్వరాజ్యం ఆశయాలు సాధించాలి


మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాగార్జున్‌రెడ్డి, నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు దివంగత మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో స్వరాజ్యం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ పోరాటంలో మల్లు స్వరాజ్యం కీలక భూమిక పోషించారన్నారు. భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం తుపాకీ చేతబట్టి దొరలు, భూస్వాములు, దేశముఖ్‌లకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జిల్లాపల్లి నరసింహారావు, వేల్పుల వెంకన్న, ధనియాకుల శ్రీకాంత్, వీరబోయిన రవి, ఎల్గూరి గోవింద్, చిన్నపంగా నరసయ్య, నేతలు వల్లపు దాసు సాయికుమార్, సుందరయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'యువికా'కు దరఖాస్తుల ఆహ్వానం

- బాల శాస్త్రవేత్తల తయారీకి యువ విజ్ఞాన్ కార్యక్రమం
- ఇస్రో ఆధ్వర్యంలో ఐదేళ్లుగా కొనసాగింపు
- దరఖాస్తులకు నేడు చివరి గడువు
- 9వ తరగతి విద్యార్థులు అర్హులు



తిరుమలగిరి (తుంగతుర్తి) : శాస్త్ర సాంకేతిక విషయాలపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించి ఆసక్తిని పెంచి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఐదేళ్ల నుంచి యంగ్ సైంటిస్టు ప్రోగ్రామ్ (యువ విజ్ఞాన కార్యక్రమం–యువికా) నిర్వహిస్తోంది. అంతరిక్ష సాంకేతికత, అంతరిక్ష శాస్త్రం, అనువర్తనాలపై ప్రాథమిక జ్ఞానం అందించడమే లక్ష్యంగా ఈ ఏడాదికి గాను ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని విద్యార్థులను ఆహ్వానిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 9వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని విద్యాశాఖ కోరుతోంది.

ఎంపిక ఇలా..
విద్యార్థులు ఆసక్తికి తగ్గట్లుగా శిక్షణ, ఆధునిక యంత్రాల పరిచయం, వాటి పనితీరు తదితరాలు ప్రయోగశాలల్లో ప్రత్యక్ష అనుభూతిని కల్పించి అందుబాటులోకి తెస్తారు. నియత బోధనకు అంతరాయం కలుగకుండా వేసవి సెలవుల్లో ఆవాస పద్ధతిన శిక్షణ ఇస్తారు. ఇందుకు విద్యార్థి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఇందులో భాగంగా నాలుగు దశల్లో జరిగే పోటీల్లో ప్రతిభ చూపాల్సి ఉంటుంది. విద్యార్థి 8, 9 తరగతుల్లో చదివిన పాఠ్యాంశాలకు సంబంధించిన విజ్ఞానాన్ని మదింపు చేసి ప్రతిభ కలిగిన వారిని గుర్తిస్తారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి మెరుగైన ప్రతిభ కనబరిచిన 150మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు. ప్రాథమికంగా 8వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా 50శాతం, సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్న వారికి పది శాతం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లో పాల్గొన్న వారికి 5శాతం, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 15శాతం, ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రతిభ చూపిన వారికి పది శాతం చొప్పున మార్కులు కేటాయిస్తారు. వీటి ఆధారంగా ఎంపికైన విద్యార్థులకు ఇస్రోకు చెందిన అహ్మదాబాద్, డెహ్రాడూన్, శ్రీహరికోట, హైదరాబాద్, బెంగళూరు, షిల్లాంగ్, తిరువనంతపురం తదితర కేంద్రాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. ఇక్కడ విద్యార్థులకు ప్రముఖ శాస్త్రవేత్తలతో ముఖాముఖి, చర్చా వేదికలు, ప్రయోగశాలల సందర్శనకు అవకాశం ఇస్తారు. అంతరిక్ష శాస్త్రం, రాకెట్ ప్రయోగాలకు సంబంధించిన అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పిస్తారు. ఎంపికై న విద్యార్థులతో పాటుగా కుటుంబ సభ్యులు ఒకరు అంతరిక్ష కేంద్రానికి చేరుకునేందుకు అయ్యే ఖర్చులన్నీ ఇస్రోనే భరిస్తోంది.

నేటితో ముగియనున్న గడువు
ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తారు. 28న మొదటి జాబితా, ఏప్రిల్ 2న 2వ జాబితాను ప్రకటిస్తారు. ఎంపికైన వారు మే 12న ఇస్రో కేంద్రాల వద్ద రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. 13 నుంచి 24 వరకు యువికా నిర్వహిస్తారు. పూర్తి వివరాలకు హెచ్‌టీటీపీఎస్//జేఐజీవైఏఎస్ఏ.ఐఆర్ఎస్.జీఓవీ.ఇన్/వైయూవీఐకేఏ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

ఎస్సీ వర్గీకరణ అమలులో కేంద్రం విఫలం


అభివాదం చేస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : ఎస్సీ వర్గీకరణను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిర్పనోళ్ల బాలరాజు విమర్శించారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రిధికా ఇన్ హోటల్లో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర స్థాయి భవిష్యత్తు కార్యాచరణ సమావేశం టీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కత్తి ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 25 సంవత్సరాలుగా పాలకులు అనేక కమిటీలు వేస్తూ కాలయాపన చేస్తున్నారని, ఇంత వరకు అతీగతి లేదని దుయ్యబట్టారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో మాదిగలకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం దళిత బంధు, అభయహస్తం పథకాలు అమలు చేయడంలో, పారిశుద్ధ్య కార్మికులను ఆదుకోవడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. సమావేశంలో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాషపంగు సత్యం, రాష్ట్ర నాయకుడు కొండగడుపుల సూరయ్య మాదిగ, కత్తి ఉపేందర్ మాదిగ, పాతకోట్ల రమేష్, వల్దాస్ శంకర్, పిడమర్తి కమల్, ములకలపల్లి కోటయ్య, నకిరేకంటి వెంకన్న, రాంబాబు, కత్తి గురవయ్య, బచ్చలకూరి సైదులు, లకపాక నాగరాజు, నర్ర మేరీ, బొల్లె సుమలత, ఎల్లమ్మ, బొల్లె రవీందర్ పాల్గొన్నారు.

కనుల పండువగా దివ్య విమాన రథోత్సవం

- తిరుమాడ వీధుల్లో విహరించిన కల్యాణమూర్తులు
- ఉదయం గరుడ వాహనంపై శ్రీమహావిష్ణువుగా ఊరేగిన స్వామి, అమ్మవారు



దివ్య విమాన రథోత్సవం ముందు అర్చకులు, ఈఓ భాస్కర్‌రావు, ఆలయ అధికారులు తదితరులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం రాత్రి లక్ష్మీదేవిని నృసింహస్వామి పరియణమాడగా.. మంగళవారం ఉదయం ఆలయంలో నిత్యారాధనల అనంతరం స్వామివారిని గరుడ వాహనంపై శ్రీమహావిష్ణు అలంకార సేవలో మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ తూర్పు రాజగోపురం ముందు సేవను వేంచేపు చేసి వేద పారాయణం పఠించారు. అనంతరం అలంకార విశిష్టతను ప్రధానార్చకులు వివరించారు. ఆయా వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహ చార్యులు, కాండూరి వెంకటచార్యులు, అర్చకులు, పారాయణీకులు, రుత్వికులు, ఆచార్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్య విమాన రథంపై..

సాయంత్రం ఆలయంలో నిత్యారాధనలు జరిపించిన అనంతరం చతుస్థానార్చనలు, మండపారాధనలు, మూలమంత్ర జపములు, ద్వార తోరణ పూజలు, దివ్య ప్రబంధ పారాయణాలు, మహామంత్ర పుష్ప పఠనాదులు, పురాణ, ఇతిహాస, విజ్ఞాపనలు నిర్వహించారు. అనంతరం రథాంగ హోమం, రథబలి, ఉత్సవమూర్తుల అలంకార సేవ ఊరేగింపు గావించారు. రాత్రి స్వామివారిని ఆలయ మాడ వీధుల్లో దివ్య విమాన రథంపై ఊరేగించారు. దివ్య విమాన రథోత్సవానికి ముందు ఆలయ మాడ వీధుల్లో స్థానిక యువకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కేరింతలు, నృత్యాలతో సందడి చేశారు. కొండపైన రథోత్సవం సమయంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నేడు మహాపూర్ణాహుతి, దేవతోద్వాసన..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, రాత్రి వేళ శ్రీపుష్ప యాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవాలు జరిపిస్తారు.

కొనసాగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం శ్రీశబరిగిరీశ అయ్యప్ప బృందం, శివరామకృష్ణ భజన మండలి, భాగ్యలక్ష్మి మహిళా భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం జరిగింది. అనంతరం వెంపరాల వెంకటలక్ష్మీ శ్రీనివాసమూర్తిచే భాగవతాంర్గత నృసింహాతత్త్వ ఉపన్యాసం నిర్వహించారు. శారద భాగవతారిణిచే ధృవ చరిత్ర అను హరికథాగానం చేశారు. సాయంత్రం శారద సంగీత విద్యాలయం వారిచే భక్తి సంగీత కార్యక్రమం, డాక్టర్ డి.వి.మోహన్‌కృష్ణచే కర్ణాటక సంగీత కార్యక్రమం, కుమారి వైష్ణవి గోపాల్‌చే వీణా వాద్యం జరిగింది. అనంతరం విశ్వజ, విష్ణుజ, సమతుల్య యోగా కూచిపూడి డ్యాన్స్, ఆర్.వి.ఎస్.ఎన్.వి సోమయాజులు, వేదాంతం కూచిపూడి డ్యాన్స్ అకాడమీ, భరద్వాజ నాట్యాలయం, డాక్టర్ నవ్య నాగబండి, నాట్య మయూరి డ్యాన్స్ అకాడమీలచే కూచిపూడి నృత్య ప్రదర్శన, గడ్డం సుదర్శన్‌చే చిందు యక్షగానం చేశారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి చెక్క భజన మండలి–శాపెల్లి వారిచే చెక్క భజన, పాలబిందెల బాలు–నల్లగొండ, లక్ష్మీ శ్రీనివాస కోలాట భజన మండలి–హైదరాబాద్, సాంస్కృతిక విశ్వకళా మండలి–రాంపల్లి వారి కోలాట బృందం స్వామి రథం ముందు కోలాటం ఆడారు.



గరుడ వాహనంపై శ్రీమహావిష్ణువుగా ఊరేగుతున్న స్వామివారు



శాస్త్రీయ నృత్యం చేస్తున్న కళాకారులు

మేధావులు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలి

- సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వర్రె వెంకటేశ్వర్లు

ఆలేరురూరల్: మేధావులు, విద్యావంతులు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు కోరారు. ఆలేరు పట్టణ కేంద్రంలోని కేవైఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర కార్యదర్శి, ప్రేమ సేవా సదనం డైరెక్టర్ మహమ్మద్ ఖుర్షీద్ పాషా అధ్యక్షతన సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్రె వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఆర్టీఐ చట్టం నిర్వీర్యం అయ్యిందని, దాని ప్రక్షాళనకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి జీఓను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండేలా, ఆన్‌లైన్‌లో ఆర్టీఐ దరఖాస్తులు స్వీకరించేలా సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో 16 కులాల కార్పొరేషన్ల ఏర్పాటుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేయడం గొప్ప విషయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎక్కువ లోక్‌సభ స్థానాలు గెలిచే బాధ్యతను యువత, విద్యావంతులు తీసుకోవాలన్నారు. ఈ చట్టం ద్వారా సమాజంలో జరుగుతున్న అవినీతిని బయటకు తీసేందుకు ఆర్టీఐ కార్యకర్తలు నిత్యం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మేధావులు, ఉద్యోగులు, జర్నలిస్టులు అందరూ ఏకతాటిపైకి వచ్చి ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి లోక్‌సభ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. సమాచార హక్కు చట్టంలో రాజకీయ నాయకులు కూడా భాగస్వాములు కావాలని, ఆ దిశగా ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సమాచార వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎర్రమాద కృష్ణారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, ఆకవరం మోహన్‌రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, శివలింగం, సురేష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం జీవితం స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

సూర్యాపేట రూరల్: వీరనారి మల్లు స్వరాజ్యం జీవితం ప్రతిఒక్కరికి స్ఫూర్తిదాయకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు రాయినిగూడెంలో మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు నిర్మించిన మల్లు స్వరాజ్యం స్మారక కళా వేదికను జూలకంటి రంగారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళా శక్తిని లోకానికి చూపించిన యోధురాలు మల్లు స్వరాజ్యం అని అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ దుర్మార్గంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతం రంగు పులుముతున్నాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని వాటిని ఎదుర్కొనేందుకు ప్రతి మహిళ మల్లు స్వరాజ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాదూరి కరుణ, సీపీఎం జిల్లా క్యాదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, సీపీఎం పార్టీ త్రీటౌన్ కార్యదర్శి మేకనబోయిన శేఖర్, కౌన్సిలర్ గంగాభవాని, ఎల్గూరి వెంకటేశం పాల్గొన్నారు.

క్లుప్తంగా

దొంగతనం కేసులో నిందితుడికి జైలుశిక్ష

నల్లగొండ క్రైం: బైక్ దొంగతనం చేసిన నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం నల్లగొండ కోర్టు అడిషనల్ జడ్జి కేవీఎస్ హరీష్‌బాబు తీర్పు వెలువరించినట్లు నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ గ్రామానికి చెందిన సంపంగి నాగేష్ కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ చోరీ చేశాడు. నాగేష్‌పై కొండమల్లేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి ఆధారాలు కోర్టుకు సమర్పించారు. ఈ కేసు విచారణలో భాగంగా సాక్ష్యాధారాలు పరిశీలించిన నల్లగొండ కోర్టు అడిషనల్ జడ్జి నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో సహకరించిన అప్పటి కొండమల్లేపల్లి ఎస్‌ఐ పి. వీరబాబు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రూపాంజలి, కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ, ఎస్‌ఐ రామ్మూర్తి, సీడీఓ వై. నగేష్, డి. శ్రావణ్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు.

గణపతి విగ్రహానికి ఏర్పాటు చేసిన మండపం ధ్వంసం

నకిరేకల్: నకిరేకల్ పట్టణంలోని శివాలయం వీధిలో గల కాకతీయుల నాటి గణపతి విగ్రహానికి ఏర్పాటు చేసిన మండపాన్ని సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఏడాది క్రితం ముళ్లపొదల మధ్య కూరుకుపోయిన గణపతి విగ్రహాన్ని పరిరక్షించి తాత్కాలికంగా మండపాన్ని ఏర్పాటు చేశారు. ఈ మండపాన్ని సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గణపతి విగ్రహ కమిటీ ప్రతినిదులు బ్రహ్మదేవర రవిశంకర్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గడ్డివాములు దగ్ధం

మఠంపల్లి : మండలంలోని యాతవాకిల్లలో రైతు షేక్ సలీమ్‌కు చెందిన 5ఎకరాల వరిగడ్డి వాములు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సలీమ్ తన 5ఎకరాల వరిపొలం కోయగా వచ్చిన వరిగడ్డిని తమ ఇంటికి సమీపంలో వాములుగా వేసుకున్నాడు. కాగా మధ్యాహ్న సమయంలో అకస్మాత్తుగా వరిగడ్డివాములు నుంచి మంటలు చెలరేగాయి. గమనించి స్థానికులు, గ్రామపంచాయతీ వాటర్‌ట్యాంకర్ సహాయంతో మంటలు ఆర్పివేసేందుకు ప్రయత్నించాం. ఈలోగా సమాచారం తెలుసుకున్న ఫైరింజన్, అధికారులు, హుజూర్‌నగర్ నుంచి వచ్చేసరికి పూర్తిగా దగ్ధమైంది. దీంతో పశువులకు మేతలేకుండా అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ.40వేల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాదితుడు కోరాడు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి



సాజిద్ అలీ

కనగల్ : రోడ్డు ప్రమాదంలో ఓ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని లచ్చుగూడెం స్టేజి సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. తోటి ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ (స్కూల్ అసిస్టెంట్)గా పనిచేస్తున్న సాజిద్ అలీ గుర్రంపాడులోని ఆదర్శ పాఠశాలలో పదోతరగతి పరీక్షల విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో విధులు ముగించుకుని నల్లగొండ పట్టణానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న గడ్డిట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టడంతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా చనిపోయిన విషయం వాస్తవం కాగా పోలీస్‌స్టేషన్‌లో తమకు ఫిర్యాదు అందలేదన్నారు. మృతుడి భార్య 6నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందినట్లు తోటి ఉపాధ్యాయులు తెలిపారు.

అధిక వడ్డీ ఆశ చూపి..

- బోర్డు తిప్పేసిన రియల్ ఎస్టేట్ సంస్థ
- రూ.5కోట్ల మేర మోసపోయిన కోదాడ, చిలుకూరు వాసులు
- లబోదిబోమంటున్న బాధితులు

కోదాడ: అధిక వడ్డీకి ఆశపడి సూర్యాపేట జిల్లా కోదాడ, చిలుకూరు ప్రాంతవాసులు హైదరాబాద్‌లోని ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో పెట్టుబడి పెట్టగా.. ఆ సంస్థ బోర్డు తిప్పేయడంతో లబోదిబోమంటున్నారు. దాదాపు వంద మంది వరకు రూ.5కోట్ల మేర పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్ పరిధిలోని నల్లచెరువు ప్రాంతంలో జేవీ బిల్డర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో వేలూరి లక్ష్మీనారాయణ, వేలూరి జ్యోతి ఎండీ, సీఎండీలుగా చెప్పుకొని ఓ రియల్ ఎస్టేట్ సంస్థను నడిపిస్తున్నారు. తమ సంస్థలో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ ఇస్తామని నమ్మబలికారు. తమకు పరిచయం ఉన్న వారిని ఏజెంట్లుగా పెట్టుకొని భారీగా డబ్బులు వసూలు చేశారు. మొదట నమ్మకం కలిగించే విధంగా ప్రతి నెలా వడ్డీ చెల్లించడంతో పలువురు వీరిని నమ్మారు.

చిలుకూరు వాసి ద్వారా పెట్టుబడి పెట్టి..

హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న చిలుకూరుకు చెందిన ఓ వ్యక్తి, కోదాడకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇద్దరు కలిసి మొదట ఈ సంస్థలో పెట్టుబడి పెట్టారు. వీరికి అధిక కమీషన్ ఇవ్వడంతో పాటు ఏజెంట్లుగా మారి మరికొంత మందిని చేర్పిస్తే అదనపు తాయిలాలు ఇస్తామని చెప్పడంతో వారు చిలుకూరు, కోదాడకు చెందిన దాదాపు 100 మందిని సదరు సంస్థలో సభ్యులుగా చేర్పించినట్లు సమాచారం. ఒక్కొక్కరు రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఈ రియల్ ఎస్టేట్ సంస్థలో పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. ప్రతి వారం కోదాడ నుంచి ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసి హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడ పూర్తయిన ఓ వెంచర్‌ను చూపి తాము అన్నీ ఇలా చేస్తామని పెట్టుబడి పెట్టిన వారికి నమ్మకం కలిగించినట్లు తెలుస్తోంది.

ఇలా ఆకర్షించారు..

తమ సంస్థలో రూ.10లక్షలు పెట్టుబడి పెడితే ప్రతి 15 రోజులకు రూ.20వేలు వడ్డీ చెల్లిస్తామని, దీంతో పాటు పెట్టుబడి పెట్టిన అసలులో ప్రతి నెలా రూ.లక్ష తిరిగి చెల్లిస్తామని చెప్పడమే కాకుండా వారికి నమ్మకం కలగడానికి వారి పేరు మీద కొన్ని ప్లాట్లు, వ్యవసాయ భూములను కూడా రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో పలువురు వీరి చేతిలో లక్షల రూపాయలు పోశారు. మొదట చేరిన వారు ఏజెంట్ల అవతారమెత్తి మరికొంత మందిని చేర్పించారు. రెండు మూడు నెలల వరకు చెల్లింపులు సక్రమంగానే చేసిన సంస్థ ఇప్పుడు బోర్డు తిప్పేయడంతో రెండు రోజుల క్రితం ఉప్పల్ పోలీసులను ఆశ్రయించారు. కోదాడ, చిలుకూరు ప్రాంత వాసులను చేర్పించిన ఏజెంట్లపై ఒత్తిడి పెరగడంతో వారు అజ్ఞాతంలోకి వెళ్లడంతో పాటు ఫోన్‌లు స్విచ్ఛాఫ్ చేసుకోవడంతో బాధితుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. సదరు సంస్థ బాధితులకు రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్లు, భూములు కూడా వారివి కావని, అవన్నీ నకిలీ పత్రాలతో చేసినవని తేలడంతో వారు లబోదిబోమంటున్నారు. చిలుకూరు వాసులు దాదాపు రూ.4కోట్లు, కోదాడ వాసులు రూ.కోటి మేర పెట్టుబడి పెట్టి మోసపోయినట్లు సమాచారం.

వాహనాల తనిఖీల్లో రూ.4.76 లక్షలు స్వాధీనం



వాడపల్లి చెక్‌పోస్ట్ వద్ద నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు

కోదాడ: మండల పరిధిలోని రామాపురం చెక్ పోస్ట్ వద్ద కోదాడ రూరల్ పోలీసులు మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.4,76,900 సీజ్ చేసినట్లు సంబంధిత కోదాడ రూరల్ ఎస్‌ఐ అనల్‌రెడ్డి తెలిపారు. సీజ్ చేసిన డబ్బును ఎస్‌ఎస్‌టీ అధికారి వినయ్‌కుమార్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50వేల కంటే ఎక్కువ డబ్బు తీసుకెళ్లేవారు సంబంధిత పత్రాలను దగ్గర పెట్టుకోవాలని ఎస్‌ఐ సూచించారు.

వాడపల్లి చెక్‌పోస్ట్ వద్ద రూ.9.50 లక్షలు..

మిర్యాలగూడ: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మంగళవారం ఓ వ్యక్తి కారులో పరిమితికి మించి నగదు తరలిస్తుండగా పట్టుకున్నట్లు వాడపల్లి ఎస్‌ఐ రవి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలంలోని వాడపల్లి శివారులో ఆంధ్రప్రదేశ్–తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు పట్టణానికి చెందిన పెనక గోపినాథ్‌రెడ్డి తన కారు(టీఎస్ 07 ఎఫ్‌ఎల్ 4545)లో హైదరాబాద్ నుంచి నెల్లూరుకు ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.9.50లక్షలు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆ నగదును స్వాధీనం చేసుకుని మిర్యాలగూడ రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మిర్యాలగూడలో రూ.84,290..

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం రాత్రి వాహనాల తనిఖీల్లో భాగంగా బొలేరో వాహనంలో వెళ్తున్న వ్యక్తి నుంచి రూ.84,290 పట్టుకున్నట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. ఎలాంటి ఆధారాలు చూపని కారణంగా పట్టుబడిన నగదును సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ రాంబాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కేతేపల్లి టోల్‌ప్లాజా వద్ద రూ.1.99లక్షల నగదు సీజ్..

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీల్లో భాగంగా మంగళవారం ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.99లక్షలు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శివతేజ తెలిపారు. చౌటుప్పల మండలం మందులగూడెం గ్రామానికి చెందిన డీసీఎం డ్రైవర్ ఎండీ అన్వర్ నుంచి రూ.99వేలు, కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన బొలెరో వాహన డ్రైవర్ ఖాజాపాషా నుంచి రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. సీజ్ చేసిన నగదును నల్లగొండ ట్రెజరీలో డిపాజిట్ చేశామని వెల్లడించారు.

నార్కట్‌పల్లి : ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎస్‌ఐ అంతిరెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలువురి నుంచి రూ.3లక్షల4వేల 500నగదు, రూ.32వేల 170 విలువ గల 74.460లీటర్ల మద్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

అభివృద్ధికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికలు కీలకం



సదస్సులో మాట్లాడుతున్న డా. కేశవులు

కోదాడఅర్బన్ : భారతదేశ అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికలు కీలకమని సమాచార హక్కు పరిరక్షణ సమితి ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని త్రివేణి డిగ్రీ కళాశాలలో సమాచార హక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలు ఎంతో కీలకమన్నారు. దేశ భవిష్యత్‌ను నిర్దేశించే ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు ఓటును వినియోగించుకోవాలన్నారు. ఓటును అమ్ముకోకుండా నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని సూచించారు. ఈసారి జరిగే ఎన్నికల్లో యువత కీలకంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికలో సమయంలో నాయకులు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు కుటిల యత్నాలు చేస్తారని ఆ ఉచ్చులో పడొద్దని కోరారు. డబ్బులు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేస్తూ ప్రలోభపెట్టే వారిపై సీ–విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సమాచార హక్కు పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఉషారాణి, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, డీఎస్పీ ఎం.శ్రీధర్‌రెడ్డి, వాగ్దేవి విద్యాసంస్థల చైర్‌పర్సన్ బాణాల వసంతవెంకటరెడ్డి, నల్లగొండ కోఆర్డినేటర్ సిరికొండ శ్రీనివాస్, పట్టణ ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, జనవిజ్ఞాన వేదిక నాయకులు చందా శ్రీనివాస్, రమేష్, శ్రీహరి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



దొండపాడు చెక్‌పోస్ట్ వద్ద రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ఉద్యోగులు ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం చింతలపాలెం మండలంలోని రాష్ట్ర సరిహద్దు గల దొండపాడు, బుగ్గమాదారం, పులిచింతల ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను, రికార్డులను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. విధుల్లో అలసత్వం పనికిరాదని నిరంతరం అప్రమత్తతతో వ్యవహరించాలని, అన్ని వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

రామగిరి(నల్లగొండ), కట్టంగూర్: తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి గ్రామ శివారులో గల బోరు బావిలో సోమవారం శవమై తేలిని వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. మృతుడు కట్టంగూర్‌కు చెందిన వనం ఈశ్వర్(33)గా పోలీసులు గుర్తించారు. సోషల్ మీడియా, వార్తాపత్రికల ద్వారా విషయం తెలుసుకున్న మృతుడి భార్య నవ్య మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే ఈశ్వర్ ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడని తెలిసింది. శాలిగౌరారం సీఐ శ్రీనివాసరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వనం ఈశ్వర్ మృతితో కట్టంగూర్‌లో విషాధచాయలు అలుముకున్నాయి.

హత్య కోణంలో దర్యాప్తు..



మృతుడి కుటుంబ సభ్యులను విచారిస్తున్న శాలిగౌరారం సీఐ శ్రీనివాసరెడ్డి

ఈశ్వర్ మెడకు, కాళ్లకు తాళ్లు కట్టి ఉండడంతో పోలీసులు హత్యగా ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. హత్య ఎలా జరిగింది, ఎవరు చేశారు, ఎంత మంది పాల్గొన్నారు? అనే వివరాలు తెలుసుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే కుటుంబ సభ్యులు, తెలిసిన వారి వద్ద కొంత మేర సమాచారం రాబట్టారు. మృతుడి కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు కొనసాగుతోంది. కాల్ డేటా వస్తే హత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



భూక్య నాగు (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం కిష్టాపురం వద్ద అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం లావూరి భీక్యతండాకు చెందిన సైదా, బుజ్జి దంపతులు వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారు. వీరికి కుమారుడు నాగు(22), కుమార్తె సంతానం. కుమార్తె వివాహం కాగా, కుమారుడి వివాహం కూడా ఈ వేసవిలో చేద్దామని అనుకున్నారు. నాగు శుభకార్యాలకు డెకరేషన్ పనులు చేస్తూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. సోమవారం నాగు దామరచర్ల మండలం బాలాజీనగర్ తండాకు చెందిన తన స్నేహితుడు రత్నావత్ దావీద్‌తో కలిసి డెకరేషన్ చేసేందుకు మిర్యాలగూడకు వచ్చాడు. డెకరేషన్ పనులు ముగించుకొని ఇరువురు బైక్‌పై తిరిగి వెళ్తుండగా మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామ సమీపంలో అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై గుర్తుతెలియని వాహనం ఎదురుగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న దావీద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం నాగు మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి బావ ధరావత్ సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాణసంచా తయారీ కేంద్రంలో పేలుళ్లు

- మిర్యాలగూడలో అనధికారికంగా బాణసంచా తయారీ



అనధికారికంగా నిర్వహిస్తున్న బాణసంచా తయారీ కేంద్రంలో చెలరేగిన మంటలు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని బాపూజీనగర్‌లో అనధికారికంగా బాణాసంచా తయారీ చేస్తున్న కేంద్రంలో మంగళవారం రాత్రి పేలుళ్లు సంభవించాయి. పట్టణానికి చెందిన ఓ టపాసుల వ్యాపారి పట్టణ శివారులోని బాపూజీనగర్‌లో రహస్యంగా బాణసంచా తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు స్థానికులు తెలిపారు. మంగళవారం రాత్రి బాణసంచా తయారీ చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి నిమిషాల వ్యవధిలోనే తయారీ కేంద్రంలోని ముడిసరుకు అంటుకోవడంతో పెద్ద శబ్దంతో కూడిన మంటలు, పొగలు వ్యాపించాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఏమి జరిగిందో తెలియక కాలనీ వాసులు పరుగులు తీశారు. పేపర్ ట్యూబ్ కంపెనీ పేరుతో షెడ్డును నిర్మించి అందులో కొంత కాలంగా బాణసంచా తయారు చేస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించినా అగ్నిమాపక కేంద్రానికి గానీ, స్థానిక పోలీసులకు గానీ సమాచారం ఇవ్వక పోవడంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులే నీళ్లు చల్లి మంటలు ఆర్పారు. కానీ, అప్పటికే దాదాపు షెడ్డు పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక శాఖ అధికారి యాదగిరిని వివరణ కోరగా.. పట్టణంలో బాణాసంచా తయారీకి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, వివరాలు సేకరించి చర్య తీసుకుంటామన్నారు.

కండక్టర్‌పై దాడి.. రిమాండ్

రామన్నపేట: కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ రామన్నపేట అదనపు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. చందన మంగళవారం తీర్పు వెలువరించినట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు. వివరాలు.. ఈ నెల 15న శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి చౌటుప్పల్ మండలం జైకేసారం వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కాడు. మద్యం మత్తులో కండక్టర్‌తో వాగ్వాదానికి దిగి అతడిపై దాడి చేశాడు. కండక్టర్ సి. నర్సింహ ఫిర్యాదుతో అదేరోజు రామన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం శ్రీనివాస్‌రెడ్డిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్ విధిస్తూ తీర్పు వెలువరించారని ఎస్‌ఐ తెలిపారు.